



మానేరు రివర్ ఫ్రంట్ ఊహాచిత్రం



మంగళవారం ప్రగతి భవన్‌లో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధిపై టాటా బృందం, కరీంనగర్ జిల్లా నేతలతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్




పర్యాటక సొబగులు ఇలా ఉండాలి

# సబర్మతి తరహాలో మానేర్ డ్యాం

## టాటా గ్రూప్ ప్రతినిధులతో కేసీఆర్

- హైదరాబాద్‌కు మించిన ఆకర్షణలు.. 'కరీంనగర్ అభివృద్ధి'పై సమీక్ష

**సాక్షి, హైదరాబాద్:** కరీంనగర్ లోయర్ మానేర్ డ్యాం రివర్ ఫ్రంట్‌ను అత్యద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ''హైదరాబాద్‌లోని పర్యాటక స్థలాల్లో సైతం లేని ఆకర్షణలు కల్పించండి. కరీంనగర్ సమీప ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులంతా రివర్ ఫ్రంట్‌ను తప్పనిసరిగా సందర్శించేలా ప్రత్యేకతలు ఉట్టిపడాలి. ఆ మేరకు అవసరమైన సదుపాయాలు కల్పించాలి. హైదరాబాద్‌వాసులకు కూడా కరీంనగర్ వెళ్లి రివర్ ఫ్రంట్ చూసొద్దామనే ఆసక్తి కలగాలి''అని అభిప్రాయపడ్డారు. మానేర్ రివర్ ఫ్రంట్ అభివృద్ధిపై కరీంనగర్ జిల్లా నేతలతో పాటు టాటా బృందంతో ముఖ్యమంత్రి మంగళవారం ప్రగతి భవన్‌లో చర్చలు జరిపారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ తదితరులు భేటీలో పాల్గొన్నారు. టాటా గ్రూప్ ప్రతినిధులు షనేశ్, సూర్యప్రకాశ్ తమ ప్రజెంటేషన్‌ను సీఎంకు చూపించారు. ''మానేర్ డ్యాంను పర్యాటక కేంద్రంగా, కరీంనగర్ నగరాన్ని టూరిస్ట్ హబ్‌గా రూపొందించడం మా ప్రాజెక్టు లక్ష్యం. కరీంనగర్‌లో మున్ముందు మరిన్ని సాంస్కృతిక, ఆహ్లాదకర కార్యక్రమాలు రూపొందించాం. తెలంగాణ ఉద్యమాన్ని, చరిత్రను ప్రతిబింబించేలా డిజైన్ చేశాం''అని వారు వివరించారు. దేశంలోనే తొలి రివర్ ఫ్రంట్‌గా గుర్తింపు పొందిన గుజరాత్‌లోని సబర్మతీ రివర్ ఫ్రంట్‌ను అధ్యయనం చేయాలని వారికి సీఎం సూచించారు. ''అక్కడి ఆకర్షణలు, సదుపాయాలన్నీ మానేర్ డ్యాం వద్ద ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. కరీంనగర్ చరిత్రకు అద్దం పట్టేలా రూపొందించండి'' అని కరీంనగర్ నగరాభివృద్ధి జిల్లా నేతలకు సీఎం పలు సూచనలు చేశారు. ''నగరాన్ని అందంగా ఎలా మలచుకోవచ్చో ఎంపీ, ఎమ్మెల్యేలు ఆలోచించాలి. పచ్చదనముండాలి. రాగి, వేప, సిల్వర్ ఓక్ మొక్కలు పెంచాలి. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలి. ఇందుకు ఒక అటవీ శాఖ అధికారిని ప్రత్యేకించాలి. శాతవాహన వర్సిటీ చుట్టూ కేబీఆర్ పార్క్ తరహాలో గ్రీన్ వాక్ వే ఏర్పాటు చేయాలి' అని సూచించారు. జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలతో సీఎం బుధవారం మళ్లీ భేటీ కానున్నారు.

# జిల్లాపై సీఎం నజర్

- నిర్లక్ష్యపు పనులపై సీరియస్
- అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రంగం సిద్ధం
- మానేరు రివర్‌ఫ్రంట్‌కు స్థలం గుర్తించాలని ఆదేశం
- నగరానికి ఓఎస్‌డీ నియామకానికి చర్యలు
- హాజరైన మంత్రి ఈటల, ఎంపీ వినోద్, ఎమ్మెల్యే గంగుల, ఎమ్మెల్సీ, మేయర్
- నేడు జిల్లా అధికారులతో సమావేశం
- మారనున్న కరీంనగర్ దశ



సాక్షి, కరీంనగర్:

ఉద్యమాల పురిటిగడ్డ.. టీఆర్‌ఎస్‌కు వెన్నుదన్నుగా నిలిచిన కరీంనగర్ జిల్లాపై ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు మరోమారు దృష్టి సారించారు. జిల్లాకేంద్రాన్ని ఉత్తర తెలంగాణకే తలమాణికంగా చేయాలన్న తపనతో కోట్లాదిగా నిధులు వెచ్చిస్తున్నారు. అయితే అధికారుల సమన్వయంలోపంతో

- మిగతా 2లో▸

# జిల్లాపై సీఎం నజర్!

▶ మొదటి పేజీ తరువాయి

కోట్లు వెచ్చిస్తున్నా.. మూడేళ్లుగా అభివృద్ధి నత్తకునడక నేర్పినట్లే సాగుతోంది. జిల్లాకేంద్రంలో జరుగుతున్న నిర్లక్ష్యపు పనులపై సీఎం సీరియస్ అయ్యారు. బుధవారం జిల్లా అభివృద్ధిపై అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కరీంనగర్ మానేరు రివర్‌ఫ్రంట్ పనులను ప్రారంభించేందుకు సీఎంతో అపాయింట్‌మెంట్ కోసం మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, టాటా కన్సల్టెన్సీ బృందం మంగళవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎంతో చర్చించారు. మూడేళ్లు గడిచినా పనుల ప్రగతి ఆశాజనకంగా లేకపోవడం, కరీంనగర్ సిటీని డెవలప్‌చేయాలన్న తన కోరిక నెరవేరకపోవడంతో సీఎం స్వయంగా రంగంలోకి దిగాలని నిర్ణయించారు. వెంటనే శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్‌ను ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్‌కు ప్రత్యేకంగా ఆఫీసర్ స్పెషల్‌డ్యూటీ (ఓఎస్‌డీ)ని నియమిస్తామని తెలిపారు. ఓఎస్‌డీగా డీఎఫ్‌వో ఆంజనేయులును కేటాయించనున్నట్లు సూచనప్రాయంగా వెల్లడించారు. నగరంలో ప్లాంటేషన్ పెంచేలా ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తానని చెప్పిన ఆయన.. వెంటనే కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. మానేరు రివర్‌ఫ్రంట్ ఏర్పాటు కోసం మానేరు చుట్టూ ఉన్న స్థలం, నగర పరిధిలో ఉన్న స్థలం ఎంత ఉంది..? అనేది స్పష్టంగా డాక్యుమెంట్లతో తీసుకురావాలని కలెక్టర్‌కు సూచించారు. అదేవిధంగా నగరంలో ట్రాఫిక్ సమస్య, ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులు రెండేళ్లుగా అధికారుల సమన్వయలోపంతో ముందుకు కదలకపోవడం, ఇతర అభివృద్ధి పనులపై కూలంకశంగా చర్చించనున్నారు. కూరగాయల మార్కెట్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తే పనులు వెంటనే ప్రారంభిస్తామన్నారు. జిల్లా సమీక్షకు పోలీస్ కమిషనర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, ఎలక్ట్రికల్ ఎస్‌ఈతో పాటు మంత్రి, ఎంపీ, ఎమ్మెలే, ఎమ్మెల్సీ, మేయర్ హాజరుకానున్నారు. కరీంనగర్ దశను మార్చేందుకు సీఎం ఏర్పాటు చేస్తున్న సమీక్షరోజంతా జరగనున్నట్లు తెలిసింది. కరీంనగర్‌పై ప్రేమతో చేపడుతున్న ఈ సమీక్ష ద్వారా నగరానికి సీఎం వరాలజల్లు కురిపించడం ఖాయమని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఏదిఏమైనా కరీంనగర్‌పై సీఎం సమీక్ష తర్వాత అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుంటుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.